సంపుటి : 9
సంచిక : 290
సోమవారం
13 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELERRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

భారత ఆర్చరీ టీమ్‌కు

## సీఎం చంద్రబాబు అభినందనలు



విశ్వం వాయిస్ న్యూస్ : మాడ్రిడ్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో రజత పతకం సాధించిన భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అభినందనలు తెలి పారు. జట్టు సభ్యులైన జ్యోతి సురేఖ వెన్నం, పృథికా ప్రదీప్, చికిత తాని పర్తిలకు ఆయన శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆంధ్రప్రదేశ్ మిగతా .. 2లో..

## డిప్యూటీ సీఎం పవన్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు



• పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి • పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు • మూడున్నర గంటల పాటు సాగిన సంక్లిష్టమైన శస్త్రచికిత్స • సినిమా షూటింగుల్లో అయిన పాత గాయాలతో బాధపడుతున్న పవన్

ముంబై, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ముంబై వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొద్దిసేపటి క్రితం ఆసుపత్రికి చేరుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నారాయణ కూడా పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ చాలాకాలంగా భుజం నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. సినిమా షూటింగుల సమయంలో అయిన పాత గాయాలు ఇప్పుడు తీవ్రం కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవలి ఎన్నికల ప్రచార సమయంలో కూడా తీవ్రమైన నొప్పిని భరిస్తూనే ఆయన కూటమి తరపున ప్రచారం నిర్వహించారు. ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో వైద్యుల బృందం పవన్ కల్యాణ్‌కు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. ఇటీవలే సైనస్ సమస్యకు కూడా ఆయన ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. తాజాగా భుజం శస్త్రచికిత్స అనంతరం పవన్ కల్యాణ్ కోలుకుంటున్నారు.

**పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు : చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.

**అభిమానుల తాకిడి వల్లే సమస్య**

పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. "పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది" అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. "పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య మిగతా .. 2లో..

14న విశాఖకు వెళ్లనున్న

## వైసీపీ అధినేత జగన్




తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : వైసీపీ అధినేత జగన్ విశాఖ పట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి మిగతా .. 2లో..

## విశాఖలో స్వల్ప భూకంపం

ఉలిక్కిపడిన నగరవాసులు

భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4 నుంచి 4.5గా నమోదు



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : విశాఖపట్నం నగరంలో సంభవించిన భూప్రకంపనలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఆదివారం మిగతా .. 2లో..

కాంగ్రెస్ నేతలపై

## కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : కాంగ్రెస్ నేతలను ఉద్దేశిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "60 ఏళ్లు తెలంగాణ నెత్తురు తాగినా ఆ పార్టీ రక్తదాహం తీరలేదా? ఉద్యమంలో ప్రాణాలు బలి తీసుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే. కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ బిడ్డల నెత్తుటి మరకలు అంటాయి. తెలంగాణ రాష్ట్ర సాధనకు పేగులు తెగేలా కొట్లాడిన వాళ్లం.. ఇప్పుడు రైతుల కోసం ఎంత రక్తమైనా మిగతా .. 2లో..

పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై

## ప్రకటన విడుదల చేసిన ముంబై ఆసుపత్రి

○ కుడి భుజానికి విజయవంతంగా ఆర్థోస్కోపిక్ సర్జరీ పూర్తి
○ ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వెల్లడి
○ పూర్తిగా కోలుకుని భుజం సాధారణ స్థితికి రావడానికి 4 నెలల సమయం
○ ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పర్దివాలా ఆధ్వర్యంలో శస్త్రచికిత్స



విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా ఒక ప్రత్యేక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఆయన కుడి భుజానికి మిగతా .. 2లో..

విజయవాడ ఆటోనగర్‌లో

## భారీ అగ్నిప్రమాదం

అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు - మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు
ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు



విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ : నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మిగతా .. 2లో..

ఇరాన్ వాదన తప్పు..

## హర్మూజ్ తెరిచే ఉంది: అమెరికా



విశ్వం వాయిస్ న్యూస్ : హర్మూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన వేళ అమెరికా మరోసారి స్పందించింది. అంతర్జాతీయ జలమార్గంలో చట్టబద్ధంగా ప్రయాణం కొనసాగించే నౌకల కోసం ఈ జలసంధి తెరిచే ఉందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్ బెదిరింపులు, ఏకపక్ష ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేందుకు వీలుగా అమెరికా బలగాలు మోహరించి, సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. తమ బలగాల పర్యవేక్షణలో కాకుండా ఏ విదేశీ నౌకా జలసంధి నుంచి మిగతా .. 2లో..

ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి

## నా సమాధానం ఇదే

ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్



విశ్వం వాయిస్ న్యూస్ : ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తనపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై తీవ్ర స్థాయిలో, వ్యంగ్యంగా స్పందించారు. 'దిగజారండి' అంటూ విమర్శకులను ఉద్దేశించి ఓ వీడియో పోస్ట్ చేశారు. తాను మౌనంగా లేనని, అన్నీ గమనిస్తున్నానని చెబుతూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "నేను మౌనంగా లేను. అన్నీ చూస్తున్నా. ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ల పలుకుబడితో మిగతా .. 2లో..

'లెనిన్' దర్శకుడిని ఘనంగా

## సత్కరించిన టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ : అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. గ్రామీణ ప్రతీకార యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మిగతా .. 2లో..

అమెరికాలో మృతి..


## మూలపాడు చేరుకున్న లక్ష్మీప్రసన్న మృతదేహం



కొండపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికాలోని న్యూయార్క్‌లో ఈనెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన అట్లూరి లక్ష్మీ ప్రసన్న (28) మృతదేహాన్ని స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా మూలపాడుకు తీసుకొచ్చారు. రెండు నెలల కిందట నవ్వుతూ అందరికీ వీడ్కోలు చెప్పిన ఆమె మృతి అందరినీ కలచివేసింది. కుమార్తె విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు మల్లేశ్వరి, మిగతా .. 2లో..

## పైసా కొట్టు, డైలాగ్ పట్టు..

ప్రకాష్ రాజ్ వీడియో పోస్ట్‌కు బండ్ల గణేష్ కౌంటర్




విశ్వం వాయిస్ న్యూస్ : నటుడు ప్రకాష్ రాజ్‌పై సినీ నిర్మాత బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా కౌంటర్ ఇచ్చారు. తనపై విమర్శలకు ప్రకాష్ రాజ్ ఇవాళ ఒక వీడియో పోస్ట్ చేశారు. దీనిపై బండ్ల గణేష్ తనదైన శైలిలో స్పందించారు. ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యల్లో నిజాయతీ లేదని, అవి ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. వివరాల్లోకి వెళితే.. "ప్రశ్నించే గొంతుల మీద మిగతా .. 2లో..

సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలపై

## వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్



గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.. ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని 'జొమాటో డెలివరీ బాయ్' అని సంబోధిస్తూ, ఆయన జీవోలను కూడా సరిగా చదవరని ఆరోపించారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ కాంగ్రెస్ కూడా నిర్ధారించింది.




## మెల్బోర్న్‌లో ఏపీఎన్ఆర్‌టీ కో-ఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం

కూటమి ప్రభుత్వానికి పూర్తిస్థాయి మద్దతివ్వాలని కీలక చర్చ - రాష్ట్ర అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని నిర్ణయం



మెల్బోర్న్, విశ్వం వాయిస్ న్యూస్ : ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీ) నూతన కో-ఆర్డినేటర్ల సమావేశం అత్యంత ఆత్మీయ, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు అందించాలని, రాష్ట్ర అభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని ఈ సమావేశంలో ప్రవాసాంధ్రులు మిగతా .. 2లో..

వియత్నాం ప్రమాద బాధితులు

## ఈ రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్న తెలుగు పర్యాటకులు

బాధితులకు అండగా నిలుస్తున్న ఏపీ ప్రభుత్వం, భారత ఎంబసీ



వియత్నాం, విశ్వం వాయిస్ న్యూస్ : వియత్నాంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదం నుంచి బయటపడిన తెలుగు పర్యాటకులంతా సురక్షితంగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## డిప్యూటీ సీఎంను పరామర్శించిన
# సీఎం చంద్రబాబు

ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు" అని చంద్రబాబు వెల్లడించారు.

**జాతీయ అంశాలపై స్పందన**

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

**భారత ఆర్చరీ టీమ్‌కు**
## సీఎం చంద్రబాబు అభినందనలు

బిడ్డ జ్యోతి సురేఖ వెన్నం అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తుండటం మాకు గర్వకారణం. ఆమె మన రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 'ఎపెక్స్ 2036' ద్వారా జ్యోతి సురేఖ వంటి మరెందరో ఛాంపియన్లను తీర్చిదిద్దుతాం. భారత జట్టు మరిన్ని విజయాలు సాధించాలి" అని ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా భారత మహిళల ఆర్చరీ జట్టును అభినందించారు. సెమీ ఫైనల్స్‌లో దక్షిణ కొరియాను ఓడించి ఫైనల్‌కు చేరడం గొప్ప విజయమని, రజత పతకం గెలవడం భారత ఆర్చరీ ప్రతిభకు నిదర్శనమని అన్నారు. మరోవైపు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసి లార్డ్స్ ఆనర్స్ బోర్డ్‌పై స్థానం సంపాదించిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచిన క్రాంతి గౌడ్‌ను అభినందించారు. ఆమె అద్భుత ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేసిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**14న విశాఖకు వెళ్లనున్న**
## వైసీపీ అధినేత జగన్

కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## విశాఖలో స్వల్ప భూకంపం

తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించడంతో గాఢ నిద్రలో ఉన్న నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీయడంతో పలు ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని సాగర్ నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, పెద వాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 4.0 నుంచి 4.5గా నమోదైంది. బంగాళాఖాతంలో పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు.

**పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై**
## ప్రకటన విడుదల చేసిన ముంబై ఆసుపత్రి

జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆసుపత్రి ఆర్థ్రోస్కోపీ అండ్ షోల్డర్ సర్వీస్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా ఆదివారం (జూలై 12) ఈ ప్రకటన జారీ చేశారు. వైద్య బులెటిన్ ప్రకారం, పవన్ కల్యాణ్ కుడి భుజంలోని 'రొటేటర్ కఫ్'కు తీవ్రమైన గాయమైంది. భుజంలోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ అనే కండర బంధనాలు (టెండన్స్) అధికంగా చిరిగిపోవడంతో పాటు, గ్రేటర్ ట్యూబరోసిటీ ఎముక వద్ద ఫ్రాక్చర్ కూడా అయినట్లు నిర్ధారణ అయిందని వైద్యులు వివరించారు. ఈ గాయానికి జూలై 11న కోకిలాబెన్ ఆసుపత్రిలో విజయవంతంగా 'ఆర్థ్రోస్కోపిక్ రిపేర్' సర్జరీ నిర్వహించినట్లు డాక్టర్ పార్దీవాలా పేర్కొన్నారు. కీ-హోల్ పద్ధతిలో జరిగిన ఈ ఆపరేషన్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని, ప్రస్తుతం పవన్ కల్యాణ్ సౌకర్యంగా ఉన్నారని బులెటిన్‌లో తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకుంటారని, ఆ తర్వాత వైద్యుల పర్యవేక్షణలో ఒక పక్కా ప్రణాళికతో కూడిన 'షోల్డర్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్' ఉంటుందని వెల్లడించారు. ఈ పునరావాస ప్రక్రియ ద్వారా రాబోయే నాలుగు నెలల్లో ఆయన భుజం పనితీరు తిరిగి పూర్తిగా సాధారణ స్థితికి వస్తుందని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు, జనసేన కార్యకర్తల్లో నెలకొన్న ఆందోళనకు ఈ అధికారిక ప్రకటనతో తెరపడినట్లయింది. ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

**విజయవాడ ఆటోనగర్‌లో**
## భారీ అగ్నిప్రమాదం

మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## హర్మూజ్ తెరిచే ఉంది: అమెరికా

ప్రయాణించలేవని ఐఆర్‌జీసీ చేస్తున్న వాదన తప్పని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. హర్మూజ్‌ను ఇరాన్ నియంత్రించ లేదని, రాకపోకలు సాగుతున్నాయని స్పష్టం చేసింది. గత ఏడు రోజుల్లో 140కి పైగా నౌకలు ఇక్కడి నుంచి ప్రయాణాలు కొనసాగించాయని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై మాట్లాడుతూ హర్మూజ్ తెరిచే ఉందన్నారు.

## సత్కరించిన టీడీపీ ఎమ్మెల్యే పులవర్తి నాని

అద్భుతమైన స్పందన లభిస్తోంది. జూలై 10న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దర్శకుడు కిశోర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సినిమా ఘన విజయం సాధించినందుకు గాను పులివర్తి నాని, దర్శకుడు కిశోర్ అబ్బూరిని తన నివాసంలో శాలువాతో సత్కరించారు. ఒక మంచి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించారని కొనియాడారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'లెనిన్' చిత్రంలో అఖిల్ అక్కినేని టైటిల్ రోల్‌లో కనిపించగా, ఆయన సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. ఈశ్వరీరావు, ప్రమోద్ పంజు, శివాజీ, బ్రహ్మాజీ, సునీల్, గెటప్ శ్రీను, శత్రు, రాంకీ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలలో అద్భుతమైన నటనను ప్రదర్శించారు. మురళీ కిశోర్ అబ్బూరి తన దర్శకత్వ ప్రతిభతో ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించడంలో పూర్తిగా సఫలమయ్యారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. తమన్ అందించిన సంగీతం, నేపథ్య సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా, జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది. విడుదలైన నాటి నుంచి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం, అఖిల్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మూలపాడు చేరుకున్న లక్ష్మీప్రసన్న మృతదేహం

వసంతరావుల ఆక్రందన చూపరులను కంటతడి పెట్టించింది. బంధువులు, గ్రామస్థుల కడసారి చూపు అనంతరం సమీపంలోని శ్మశాన వాటికకు మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి, ఎన్ఆర్ఐ కోమటి జయరాం చొరవతో లక్ష్మీ ప్రసన్న మృతదేహం మూలపాడుకు చేరుకుంది. ఆదివారం తెల్లవారు జామున హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన మృతదేహాన్ని అంబులెన్స్‌లో మూలపాడు తీసుకొచ్చారు. ముందుగానే ఏర్పాట్లు చేసి ఉండడంతో శ్మశాన వాటిలో దహన కార్యక్రమాలు నిర్వహించారు.

## పైసా కొట్టు, డైలాగ్ పట్టు..

తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం" అంటూ ప్రకాశ్ రాజ్ నేడు ఓ వీడియోను ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. తనపై వస్తున్న విమర్శలు, తప్పుడు ప్రచారాలపై ఆయన ఆ వీడియోలో స్పందించారు. ఈ పోస్టుపై బండ్ల గణేశ్ ఘాటుగా స్పందించారు. ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశిస్తూ, "ఎవరితోనో ట్వీట్ రాయించుకుని వచ్చి పోస్ట్ చేయడం కాదు. మాట్లాడటం అంటే సినిమాల్లో రాసిచ్చిన డైలాగ్‌ను తెలుగు డబ్బింగ్ చెప్పినట్టుగా కాదు. ప్రజలతో మాట్లాడే మాట హృదయం నుంచి రావాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. ప్రజల మనసు గెలవాలంటే స్క్రిప్ట్ కాదు... నిజాయతీ కావాలి, తమ్ముడూ!" అని వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా, "పైసా కొట్టు... డైలాగ్ పట్టు! ప్రకాశ్ రాయ్ అలియాస్ ప్రకాశ్ రాజ్, ఫ్రమ్: కర్ణాటక" అంటూ మరో వ్యంగ్యాస్త్రం సంధించారు.

## మెల్బోర్న్‌లో ఏపీఎన్ఆర్‌టీ కో-ఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం

ఏకగ్రీవంగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రవాసులకు మధ్య వారధులుగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కో-ఆర్డినేటర్లు అందరూ కలిసి కేక్ కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం, పదవులు పొందిన ప్రతినిధులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమకు ఈ కీలక బాధ్యతలు అప్పగించి, ప్రవాసాంధ్రుల సేవలో పాలుపంచుకునే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల తరఫున ఏ విధంగా మద్దతు ఇవ్వాలనే దానిపై ప్రధానంగా దృష్టి సారించారు. కేవలం ఆర్థికంగానే కాకుండా, తమ నైపుణ్యాలు, అంతర్జాతీయ అనుభవాన్ని కూడా రాష్ట్ర ప్రగతికి అందించాలని నిర్ణయించారు. ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవాసాంధ్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వారిని చైతన్యవంతం చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని కో-ఆర్డినేటర్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతికి శాయశక్తులా కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు. ఈ విజయవంతమైన కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీ రీజినల్ కో-ఆర్డినేటర్ లగడపాటి సుబ్బారావు, ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ సభ్యులు నర్మదా జొన్నలగడ్డ, గోపి నంబళ్లతో పాటు నూతన కో-ఆర్డినేటర్లు సుమా తాటినేని, కిశోర్ బలుసు, బాల పసుపులేటి పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో ఇతర కో-ఆర్డినేటర్లు, పలువురు ప్రవాసాంధ్ర ప్రముఖులు హాజరయ్యారు.

## ఈ రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్న తెలుగు పర్యాటకులు

హనోయిలోని నోయ్ బాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరంతా ఆదివారం రాత్రి 7:05 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో బయల్దేరి, భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకల్లా హైదరాబాద్ చేరుకోనున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతిచెందగా, వారిలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. ఓ మొబైల్ ఫోన్ కంపెనీ తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహారయాత్రలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బోటులో మొత్తం 32 మంది ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏపీకి చెందిన గెల్లి కిశోర్ అనే వ్యక్తి వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులను వీలైనంత త్వరగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మరోవైపు, మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను హో చి మిన్ నగరానికి తరలిస్తున్నట్లు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. అక్కడ అవసరమైన లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత, మృతదేహాలను వీలైనంత త్వరగా భారత్‌కు పంపిస్తామని పేర్కొంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ప్రభుత్వం, న్యూఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు బాధితులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

ధారపోసేందుకు సిద్ధం. మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం.. మీ రక్తదాహం తీర్చుకోండి. కానీ.. రైతులకు మాత్రం నీళ్లివ్వండి." అని కేటీఆర్ పేర్కొన్నారు.

## నా సమాధానం ఇదే

జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన చానళ్లు, యూట్యూబర్లు... సోషల్ మీడియాలో మీ అబద్ధాలు, మీరు అల్లుతున్న కట్టుకథలు, మీ బూతులు అన్నీ వింటున్నా. మీ అందరికీ నా సమాధానం ఒక్కటే.. దిగజారండి... దిగజారండి... దిగజారుతూనే ఉండండి. ఇది మీ దిగజారుడుతనానికి ఆరంభం మాత్రమే. మొత్తం ప్రపంచం మీ దిగజారుడుతనాన్ని చూస్తోంది. అయితే, దిగజారడం అనే సామర్థ్యంపై మీకున్న నమ్మకాన్ని మాత్రం దిగజారనివ్వకండి. కాస్త గట్టిగా దిగజారండి... అరుస్తూ దిగజారండి... నాలుగు వైపుల నుంచి దిగజారండి... సిగ్గులేకుండా దిగజారండి. దిగజారడంలో మీకు మీరే సాటి అనే గర్వంతో దిగజారండి. ఎంత చేసినా ప్రశ్నించే గొంతుకలను మాత్రం ఆపలేరు. మీ పని మీరు కానివ్వండి... దిగజారుతూనే ఉండండి.. జస్ట్ ఆస్కింగ్.." అంటూ తన వీడియోను ముగించారు. ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# హర్మూజ్‌లో హైటెన్షన్.. ఖతార్ కీలక నిర్ణయం

**విశ్వం వాయిస్ న్యూస్ :** దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని మరోసారి మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం, నౌకలపై దాడులు చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో గల్ఫ్ దేశం ఖతార్ కీలక నిర్ణయం తీసుకుంది. సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతోపాటు, చేపల బోట్లును కూడా నిలిపివేయాలని స్పష్టం చేసింది. ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఖతార్ రాజధాని దోహాపై ఇవాళ ఉదయం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిలో కొన్నింటిని ఖతార్ రక్షణ వ్యవస్థ కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కొందరు పౌరులకు తీవ్ర గాయాలైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ సేనలు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు ఖతార్ ప్రభుత్వం తెలిపింది.

**బాధ్యతారాహిత్యమైన చర్యలు: ఒమన్**

ఇరాన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఒమన్ మండిపడింది. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట తమ భూభాగంపై బాంబులు ప్రయోగించడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ఒమన్‌లోని ఇరాన్ రాయబారికి సోషల్ మీడియా వేదికగా



నిరసన తెలిపింది. "ఇరాన్ బాధ్యతారాహిత్యమైన చర్యలపై ఒమన్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. దేశ సార్వభౌమాధికారం, పొరుగు దేశాలతో సత్సంబంధాలు, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం తదితర నిబంధనలకు కట్టుబడి ఉండటం అత్యంత అవసరం" అని ఒమన్ ప్రభుత్వం అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. హర్మూజ్ జలసంధిపై చర్చల కోసం ఇరాన్ విదేశాంగ మంత్రికి ఒమన్ ఆతిథ్యం ఇచ్చిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం.

**యాత్రికుల బస్సు బోల్తా..**
# 16 మందికి గాయాలు

కాంగ్రా, విశ్వం వాయిస్ న్యూస్ : అవంగ్ నాధ్ యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడడంతో 16మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో చోటు



చేసుకుంది. ఘటన జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ నుంచి డెహ్రాదూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

# ఎడిటర్ వాయిస్

## నల్లారి వారు నలిగిపోతున్నారుగా!

నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఏపీకి చిట్ట చివరి ముఖ్యమంత్రి. ఇది ఆయనకు రాజకీయ చరిత్రలో అనుకోకుండా దక్కిన ఒక రికార్డు. అంతే కాదు మరో ప్రత్యేకత కూడా ఆయనకు ఉంది, మంత్రి కాకుండానే ముఖ్యమంత్రి అయిపోయారు. ఆయన ముందు ఎవరూ అలా కాలేదు కానీ ఆ తర్వాత మాత్రం ఏపీలో జగన్ తెలంగాణాలో రేవంత్ రెడ్డి ఆ విధంగానే అయ్యారు. ఇక ఉమ్మడి చిత్తూరు జిల్లా పీలేరు నుంచి పలు సార్లు గెలిచి వచ్చిన కిరణ్ కుమార్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూలంగా మంత్రి కాలేకపోయారు. అయితే వైఎస్సార్ ఆయన మీద సాఫ్ట్ కార్నర్ తో ఉండడంతో స్పీకర్ గా చేశారు. వైఎస్సార్ మరణం తరువాత కిరణ్ కుమార్ రెడ్డి ఢిల్లీ స్థాయిలో తన పలుకుబడిని సాన్నిహిత్యాన్ని ఉపయోగించి అనూహ్యంగా ముఖ్యమంత్రి పీఠం అందుకున్నారు అని చెబుతారు.

**జాక్ పాట్ సీఎం అంటూ :** ఇక కిరణ్ కుమార్ రెడ్డి సీఎం అయితే ఆయన ప్రత్యర్థులు మాత్రం జాక్ పాట్ లా సీఎం పదవి తగిలింది అని సెటైర్లు పేల్చేవారు. మరి అదేమి సందర్భంలో అన్నారో తెలియదు కానీ 2014 మార్చిలో ఆయన తన పదవికి రాజీనామా చేసిన తరువాత పుష్కర కాలంగా రాజకీయంగా ఆయన మళ్ళీ ముందు వరసలోకి రాలేకపోయారు. అంతే కాదు కీలకమైన అధికార పదవులు ఆయనకు దక్కలేదు. జై సమైకాంధ్రా పార్టీని ఆయన స్థాపించి 2014 ఎన్నికల్లో తాను పోటీకి దిగకుండా తన వారిని దింపినా ఆ పార్టీకి ఎక్కడా డిపాజిట్లు దక్కలేదు. ఆ మీదట కొన్నాళ్ళకు కాంగ్రెస్ లో చేరిన ఆయన అందులో నుంచి కూడా బయటకు వచ్చేశారు. ఇక అటూ ఇటూ చూసి కమలం పార్టీ కండువా కప్పుకున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో తనలాంటి సీనియర్ కి మాజీ సీఎం కి తగిన హోదా గౌరవం దక్కుతుంది అని ఆయన భావించారు.

**ఓటమితో మారిన లెక్క :** అయితే బీజేపీ కూడా ఉమ్మడి ఏపీకి సీఎం గా పనిచేసిన వారు బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతగా కిరణ్ ని చేరుకుని ఆశలు పెట్టుకుంది. 2024 ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా ఆయనకు రాజం పేట లోక్ సభ సీటు కేటాయించారు. అయితే వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి చేతిలో ఆయన ఓటమి పాలు అయ్యారు. ఆ ఒక్క ఓటమే ఆయన రాజకీయ దశను లెక్కను కూడా కూడా మార్చేసింది అని అంటున్నారు. ఆ ఎన్నికల్లో కనుక కిరణ్ కుమార్ రెడ్డి గెలిచి ఉంటే ఈపాటికి కేంద్రంలో కేబినెట్ ర్యాంక్ మంత్రిగా ఉండేవారు. కానీ జస్ట్ మిస్ అన్నట్లుగా తయారైంది. ఆ తరువాత ఏపీ నుంచి రెండు మూడు సందర్భాలలో ఖాళీ అయిన రాజ్యసభ సీట్లలో కిరణ్ కుమార్ రెడ్డి రేసులో ఉన్నట్లుగా వినిపిస్తూ వచ్చింది. అయితే చివరి నిముషంలో వేరే వారికి ఆ పదవులు దక్కాయి. ఇక తాజాగా జూన్ లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఏపీ నుంచి నాలుగు సీట్లు ఖాళీ అయితే అందులో మూడు టీడీపీ ఒకటి జనసేన గెలుచుకున్నాయి. బీజేపీకి ఒక్క సీటూ కేటాయించలేదు.

**అడిగి ఉండాల్సిందిగా :** ఇక ఏపీ నుంచి నల్లారి వారిని రాజ్యసభకు తీసుకుని రావాలని బీజేపీ పెద్దలకు ఉంటే కనుక ఒక సీటు కూటమి నుంచి అడిగి తీసుకునేఅవరు అని అంటున్నారు. బీజేపీ పెద్దలు అడిగితే టీడీపీ కూడా ఇచ్చి ఉండేదని అంటున్నారు. కానీ ఆ విధంగా జరగలేదు అంటే కేంద్ర బీజేపీ పెద్దలు కిరణ్ కుమార్ రెడ్డి విషయంలో ఏమి ఆలోచిస్తున్నారు అన్నది ఒక చర్చగా ఉంది. అంతే కాదు కిరణ్ కుమార్ రెడ్డి రాజ్యసభకు వెళ్ళి ఆ విధంగా కేంద్ర మంత్రి కావాలని చూస్తున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే బీజేపీ ఆలోచనలు వేరు అని అంటున్నారు.

**పార్టీ పటిష్టత కోణంలో :** బీజేపీ పెద్దలు అయితే ఎవరిని అయినా చేర్చుకున్నా కూడా పనితీరుని గమనిస్తారు. పార్టీ పటిష్టత ఆధారంగానే పదవులు పంచుతారు అని అంటారు. కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కువ కాలం హైదరాబాద్ లోనే ఉంటారు అని కూడా ప్రచారంలో ఉంది. ఆయన సొంత నియోజకవర్గంలో కూడా పట్టు సడలుతోందని కూడా చెబుతూంటారు. దాంతో ఆయన విషయంలో బీజేపీ పెద్దలు అయితే సీనియర్ నాయకుడిగానే చూస్తూ వస్తున్నారు తప్పించి అధికార పదవులలో అయితే ప్రాధాన్యత ఇవ్వడం లేదని అంటున్నారు. ఇక కాంగ్రెస్ బీజేపీ వంటి జాతీయ పార్టీలలో ఉన్నా తన రాజకీయ జాతకం మారకపోవడం పట్ల కిరణ్ కుమార్ రెడ్డి కొంత అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. చూడాలి మరి జాతీయ కార్యవర్గంలో ఆయనకు కీలక స్థానం దక్కుతుందేమో అన్నది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## అనంతగిరిలో ట్రెక్కింగ్‌కు వెళ్లి హైదరాబాద్ మహిళ మృతి



**వికారాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రెక్కింగ్‌కు వెళ్లి మహిళ మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరిలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ప్రియాంక మోల్ (47).. ట్రెక్కింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. స్థానికులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వారాంతపు సెలవు కావడంతో హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌కు చెందిన ప్రియాంక మోల్, మరో ముగ్గురు కుటుంబసభ్యులు విహారయాత్ర కోసం ఆదివారం ఉదయం అనంతగిరి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత నందిఘాట్ పరిసరాల్లో తిరిగారు. అనంతరం ట్రెక్కింగ్ చేస్తూ వ్యూపాయింట్ దగ్గరకి వెళ్లి అనంతగిరి అటవీ ప్రాంతాన్ని తిలకించారు. ఈ క్రమంలో ప్రియాంక మోల్ తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను నాలుగు కి.మీ దూరంలో ఉన్న వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. ప్రియాంక గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. అప్పటి వరకు తమతో సరదాగా గడిపిన ప్రియాంక మోల్ విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

### షాబాద్ ఆరు హత్యల కేసు..

## నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు



**షాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

## ఒంగోలులో కారు బీభత్సం.. ఏఆర్ కానిస్టేబుల్ మృతి



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా ఒంగోలులో మహిళా వైద్యులు ప్రయాణిస్తున్న కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో సైకిల్‌పై వెళుతున్న ఏఆర్ కానిస్టేబుల్ మరియదాసు(36)ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుకి అవతల వైపు ఉన్న సర్వీస్ రోడ్డులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత కారు ముందుకు దూసుకెళ్లి చెత్త ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్నది మహిళా వైద్యులుగా గుర్తించారు. ఒంగోలులో జరుగుతున్న గైనకాలజిస్టుల రాష్ట్ర సదస్సుకు హాజరైన వీరు ఆదివారం ఉదయం కాఫీ షాప్‌కి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారం తెలియగానే జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. తాలూకా సీఐ టి.విజయ్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదం.. ఇద్దరు కూలీల దుర్మరణం



**దేవరపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు దేవరపల్లి గ్రామానికి చెందిన శ్రీను(39), కడలి రాజేంద్ర (32)గా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వనస్థలిపురం పనామా వద్ద వ్యక్తి హత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వనస్థలిపురం పనామా వద్ద ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. రోడ్డు పక్కన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహంపై రాళ్లతో కొట్టిన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వివరాలు, హత్యకు కారణాలపై వనస్థలిపురం పోలీసులు ఆరా తీస్తున్నారు.





సీఎం చంద్రబాబు పర్యటనను

# చారిత్రాత్మక విజయవంతం చేయాలి

## ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలపాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని కొనియాడారు. గోదావరి డెల్టా రైతుల జీవితాలను ప్రభావితం చేసే ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునీకరణలో భాగంగా, రూ.150 కోట్లతో 117 గేట్ల పనులకు శ్రీకారం చుట్టడం ఆయనకు రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ ఆధునీకరణ ద్వారా డెల్టా ప్రాంత సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతమై, లక్షలాది రైతు కుటుంబాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం నీటి నిర్వహణ, కాలువల అభివృద్ధి, వరద నియంత్రణ, వ్యవసాయ ఆధునీకరణ అంశాల్లో ముందుచూపుతో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పిచ్చుకలంకలో జరగనున్న సీఎం ముఖాముఖి కార్యక్రమం రైతుల సమస్యల పరిష్కారానికి ఒక మంచి వేదికగా నిలుస్తుందని, రైతులు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనల మేరకు రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను ఘనవిజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రైతు బాంధవుడైన ముఖ్యమంత్రికి కోనసీమ గడ్డపై అపూర్వ స్వాగతం పలుకుతూ రైతుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, జనసేన కాజులూరు మండల అధ్యక్షులు బోండా వెంకన్న, గరికపాటి సూర్యనారాయణ, మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# 37వ జాతీయ గణిత పోటీలకు సన్నాహాలు

### ఆగస్టు చివరి వరకు దరఖాస్తుల స్వీకరణ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో 37వ జాతీయ గణిత పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.వి.వి. సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా సెప్టెంబర్ 20న ప్రిలిమినరీ పరీక్షను, నవంబర్ 15న ఫైనల్ పరీక్షను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీకి సంబంధించిన పాంప్లెట్‌ను డాక్టర్ సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ, డాక్టర్ టి.ఎస్.వి.ఎస్.సూర్యనారాయణమూర్తి, ఎం.నాగార్జున, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణ సాయి, పి.రవిశంకర్, మహర్షి దయాసాగర్ తదితరులు ఆవిష్కరించారు. ఈ పోటీల్లో మూడవ తరగతి నుండి హైస్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ స్థాయి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు తమ విద్యాసంస్థల ద్వారా ఆగస్టు నెలాఖరు వరకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే వివిధ విద్యాసంస్థలకు పాంప్లెట్లను పంపినట్లు అకాడమీ సభ్యులు వెల్లడించారు. ఫైనల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డిసెంబర్ 22న నిర్వహించే రామానుజన్ జయంతోత్సవ సదస్సులో మరియు అకాడమీ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సత్కరించనున్నట్లు తెలిపారు. గణితంపై ఆసక్తి ఉన్న విద్యార్థులందరూ ఈ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని అకాడమీ కార్యవర్గం కోరింది.

అమలాపురం రీజియన్ గోల్డ్ అప్రైజర్స్

# యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార కళ్యాణ మండపంలో గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు నలమాటి కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమలాపురం రీజియన్ అధ్యక్షుడిగా కట్టోజు ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా భరణికానా బాబు, కోశాధికారిగా అప్పాబత్తుల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా టేకి శివకుమార్ సహా మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# జగన్‌కి చోటిస్తున్న బాబు... వ్యూహం కరెక్టేనా?



రాజకీయాల్లో ధక్కామెక్కీలు తిన్న వారు చంద్రబాబు. ఆయనకు వ్యూహాల గురించి ఎవరూ చెప్పాల్సిన పని లేదు. ఎన్నో యుద్ధాలను చూసిన వారు, అందులో ఆరితేరిన వారు. ఇక ఆయన వ్యూహాలలో అధిక శాతం సక్సెస్ నే చూశాయి. ఆయన తన రాజకీయ జీవితంలో ఎంతో మంది రాజకీయ ప్రత్యర్థులతో పోరాడారు. అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ తో బాబు రాజకీయ పోరాటం మాత్రం సుదీర్ఘమైనది అని చెప్పాలి. కాంగ్రెస్ తో టీడీపీకి రాజకీయ సమరం ఉన్నపుడు అటు వైపు నాయకులు తరచూ మారుతూ ఉండేవారు. ఇక వైఎస్సార్ మాత్రమే ఎక్కువ కాలం బాబుతో నిలిచి పోరాడారు. అలాగే రెండు సార్లు సీఎం అయ్యారు. ఆయన తరువాత బాబు అంత సుదీర్ఘమైన పోరాటం మళ్ళీ జగన్ తోనే చేస్తూ వస్తున్నారు.

**గతానికి భిన్నంగా :** ఇదిలా ఉంటే 2014 నుంచి చంద్రబాబుకి జగన్ కి మధ్య ఏపీ వేదికగా రాజకీయంగా భీకర సమరం సాగుతోంది. ఇది రాజకీయ ప్రత్యర్థులను మించి అని కూడా చెప్పుకోవాలి. సాధారణంగా రాజకీయ నేతలు ప్రత్యర్థులుగానే ఉంటారు. ఎక్కడైనా కనిపిస్తే చాలు మాట్లాడుకుంటారు. కానీ ఏపీ మాత్రం దానికి భిన్నం అని చెప్పాల్సి. చంద్రబాబు జగన్ ఇద్దరూ ఒకరికి ఒకరు ఎదురుపడరు. అసెంబ్లీలో మాత్రమే అది సాధ్యపడేది. కానీ 2024 తరువాత జగన్ అసెంబ్లీకి వెళ్ళడం లేదు. దాంతో అది కూడా లేకుండా పోయింది. దాంతో రాజకీయ పోరు ఇంకా ఎక్కువ అయిపోతోంది. కలిసి కూర్చుని అధికార విపక్షాలు ప్రజా సమస్యల మీద చర్చించుకుంటే వ్యక్తిగత ఫోకస్ తగ్గి జనరల్ ఇష్యూస్ కీలకం అవుతాయి. కానీ అది ఎక్కడా కనిపించడం లేదు.

**అప్పటి కంటే ఎక్కువగా :** ఇక 2014 నుంచి 2019 దాకా చంద్రబాబు సీఎంగా ఉన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఆనాడు రెండు పార్టీల మధ్య రాజకీయ పోరు ఉంది కానీ మరీ ఇంతలా లేదని చెప్పవచ్చు. పైగా ఆనాడు జగన్ 67 మంది ఎమ్మెల్యేల బలంతో ఉన్నారు. తరచూ అసెంబ్లీకి వచ్చేవారు, ప్రజలలో కూడా తిరిగేవారు. కానీ ఆనాడు బాబు అవసరమైన సందర్భాలలో తప్పించి జగన్ మీద పెద్దగా విమర్శలు చేసినది లేదు. కానీ 2024లో చూస్తే వైసీపీ తన మొత్తం రాజకీయ జీవితంలో ఘోరమైన ఓటమిని అందుకుంది. కేవలం 11 సీట్లకే పరిమితం అయింది. ఇక జగన్ కూడా అసెంబ్లీకి రావడం లేదు, ప్రజలలో కూడా పెద్దగా తిరగడం లేదు. ఒక విధంగా ఏపీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాజకీయ తెర మీద పెద్దగా కనిపించడం లేదు అన్నది తెలిసిందే. అయితే జగన్ లేడన్న బాధ లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మంత్రులు మిత్ర పక్ష నేతలు అంతా ఆయన మీద ప్రతీ రోజూ విమర్శలు చేస్తూ ఆయనను పొలిటికల్‌గా లైం లైట్‌లో ఉంచుతున్నారు అన్నది ఒక విశ్లేషణ.

**ఇంతలా ఎందుకు మరి :** జగన్ ఏపీలో ఉండేది బహు తక్కువ అన్నది విమర్శలు ఉన్నాయి. ఆయన సభలలో ప్రసంగించినది కూడా లేదు, జనంతో తిరిగినది లేదు, కానీ చంద్రబాబు మాత్రం సభలో అయినా ప్రెస్ మీట్ లో అయినా పార్టీ వేదికల మీద అయినా జగన్ గురించే ఎక్కువగా మాట్లాడుతూండడం ఆశ్చర్యంగా ఉందని అంటున్నారు. నిజానికి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు తమ ప్రసంగాలలో ప్రత్యర్థులకు ఎక్కువగా చోటు కల్పించరు, అదొక రకం స్ట్రాటజీ. కానీ చంద్రబాబు మాత్రం సభ ఎక్కడ జరిగినా జగన్ గురించే తన ప్రసంగంలో సగానికి సగం కేటాయిస్తూండడం విశేషమే. అయితే ఇక్కడే బాబు వ్యూహం కూడా ఉంది. గొడ్డలి పార్టీ అని దాని నాయకుడు అని జగన్ గురించి అంటున్నారు తప్పించి ప్రత్యేకంగా పేరు పెట్టి మాట్లాడటం లేదు. అయితే ఆయన పరోక్షంగా విమర్శించినా జగన్ గురించే అన్నది జనాలకు అందరికీ తెలుస్తూనే ఉంటుంది. ఎందుకంటే ఇది సోషల్ మీడియా యుగం కాబట్టి.

**జనాలలో ఆ భావన కోసమే :** గొడ్డలి పార్టీ విధ్వంసకర నాయకుడు అని జగన్ గురించి జనంలో ఒక వ్యతిరేక భావన వ్యాప్తి చేయాలన్నదే బాబు మార్క్ పాలిట్రిక్స్ గా చెబుతున్నారు. ఆ పార్టీని ఆ నాయకుడిని మరోసారి ఎన్నుకోవద్దు అని ఆయన చెప్పాలనే ఉద్దేశ్యంతోనే ఈ విధంగా ఘాటుగా విమర్శిస్తున్నారు అని అంటున్నారు. అయితే రాజకీయాల్లో విమర్శల గురించి జనాలు సీరియస్ గా తీసుకోవడం పోయి రెండు దశాబ్దాలు దాటుతోంది అన్నది ఉంది. ఎందుకంటే ప్రజలు ఇపుడు స్మార్ట్ గా ఉన్నారు. వారు తమ గురించి తమ ప్రాంతం గురించి తమ అనుకూల పరిస్థితుల గురించి ఆలోచించుకునే పార్టీల వైపు మొగ్గు చూపుతూంటారు. ఒక ఏపీలో చూస్తే చిత్రమైన తీర్పులు జనాలు ఇస్తూంటారు. ఒకరికే రెండు సార్లు అధికారం ఇస్తే తమను పట్టించుకోరన్న భయమో సందేహమో తెలియదు కానీ తడవకు ఒకరిని మార్చి అధికారం అప్పచెప్పడం ద్వారా తమ తీర్పు పట్ల ఎల్లపుడు పాలకులు అప్రమత్తంగా ఉండాలనేది ఏపీ జనాల ఆలోచనగా చెబుతారు. అందువల్ల రాజకీయ విమర్శలు ఎక్కువగా చేస్తే అది మరో విధంగా పరిణమించే ప్రమాదం కూడా ఉంది అని అంటున్నారు. బలమైన నాయకుడు ప్రత్యర్థిగా ఉన్నారు కాబట్టే ఇలా చేస్తున్నారు అని కూడా జనంలోకి తెలియకుండా ఒక భావన పంపించేవారు కూడా అవుతారు అంటున్నారు. ఏది ఏమైనా బాబు ఈసారి అంటే 2024 తరువాత కొత్త స్ట్రాటజీతో ముందుకు సాగుతున్నారు. మరి ఇది కరెక్ట్ గా గురి కొడుతుందా లేదా అన్నది మూడేళ్ళ తరువాతనే తేలుతుంది.

# రావణ్ కేసులో యూటర్న్..

### సంబంధం లేదంటున్న న్యాయవాది!



నిన్న మొన్నటి వరకు యూట్యూబర్ రావణ్‌ను వెనుకేసుకువచ్చి.. ఆయనకు మద్దతుగా మాట్లాడిన ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ యూటర్న్ తీసుకున్నారు. రావణ్ చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని, అసలు ఆయనను గెస్టుగా కూడా తాను పిలవలేదని తెలిపారు. పిలవని పేరంటానికి వచ్చి.. రచ్చ చేశాడని వ్యాఖ్యానించారు. ఈ కేసులో రావణ్ చేసిన వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

**అసలు ఏం జరిగింది?**

ఏలూరులో గత నెలలో జడ శ్రవణ్ కుమార్ నేతృత్వంలో భారీ సభను నిర్వహించారు. ఈ సభలోనే రావణ్.. నోటికి పనిచెప్పాడు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పై నోటికి ఇష్టం వచ్చినట్టు వ్యాఖ్యానించాడు. దీంతో జనసేన అభిమానులు, పవన్ కల్యాణ్ అభిమానులు రావణ్ పై కేసులు పెట్టారు తాజాగా అసలు సభకు అనుమతి ఎవరు ఇచ్చారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీంతో తన మెడకు ఉచ్చు బిగుసుకుంటోందని భావించిన జడ శ్రవణ్ అనూహ్యంగా యూటర్న్ తీసుకున్నారనే వాదన వినిపిస్తోంది. ఆది నుంచి రావణ్‌ను వెనుకేసుకువచ్చిన వారిలో జడ శ్రవణ్ ఉన్నారు. రావణ్‌పై కేసులు పెట్టడం అంటే.. భావ ప్రకటనా స్వేచ్ఛను బందీ చేయడమేనని వ్యాఖ్యానించిన ఆయన.. కోర్టులోనూ రావణ్‌కు అనుకూలంగా వాదనలు వినిపించారు. ఎప్పుడైతే.. ఏలూరు సభ వ్యవహారం తెరమీదికి వచ్చిందో వెంటనే ఆయన యూటర్న్ తీసుకున్నారు. ఇలాంటి కేసుల్లో సభా నిర్వాహకులకు కూడా బాధ్యత ఉంటుందని గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే జడ శ్రవణ్‌పై కేసులు పెట్టేందుకు పోలీసులు పరిశీలిస్తున్నారు. సభకు నేను ఆహ్వానించిన వారు రాలేదు. ఎవరికైతే ఆహ్వానం పంపలేదో వారు వచ్చారు. నాకంటే ముందుగానే వచ్చి.. వేదికపై కూర్చున్నారు. పైగా రావణ్ అలా మాట్లాడతాడని నేను మాత్రం ఊహించానా? ఆయన చేసిన వ్యాఖ్యలకు నాకు సంబంధం లేదు. రావణ్‌పై ఎలాంటి కేసులైనా పెట్టవచ్చు అని శ్రావణ్ తెలిపారు. మరోవైపు.. వైసీపీ లీగల్ సెల్ ఎంట్రీ ఇవ్వడంతో తనకు దక్కాల్సిన మైలేజీ పోతోందన్న ఆవేదనతోనే జడ ఇలా యూటర్న్ తీసుకున్నారన్న మరో వాదన కూడా వినిపిస్తోంది. ఏదేమైనా దుర్భాషలకు, నోటి దురుసు వ్యక్తులకు మద్దతు ఇస్తుండడం పట్ల స్థానికంగా వ్యతిరేక త కూడా పెరుగుతోంది.

# విశాఖలో భూప్రకంపనలు



ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ భూకంపం ప్రభావం విశాఖపట్నంతో పాటు కాకినాడ నుంచి విజయనగరం వరకు పలు ప్రాంతాల్లో స్వల్పంగా కనిపించింది. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ రిపోర్ట్ ప్రకారం.., ఆదివారం తెల్లవారుజామున 5:05 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. కాకినాడ తీరానికి దాదాపు 225 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున దీని కేంద్రం ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ భూప్రకంపనలు చాలా స్వల్పంగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం గానీ.. ఆస్తి నష్టం గానీ సంభవించలేదు. తెల్లవారుజామున 5 గంటల సమయం కావడంతో అత్యధిక శాతం మంది ప్రజలు గాఢ నిద్రలో ఉండటం వల్ల అసలు భూప్రకంపనలు వచ్చాయనే విషయమే చాలామందికి తెలియలేదు. మేల్కొని ఉన్న కొద్దిమంది మాత్రమే స్వల్పంగా భూమి కంపించినట్లు గుర్తించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. భయపడాల్సిన పరిస్థితి అస్సలు లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అయినా ఈ చిన్న విషయాన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో పెద్దదిగా చూపే ప్రయత్నం చేశారు. వాస్తవం ఇలా ఉంటే కొన్ని మీడియా సంస్థలు మాత్రం వ్యూస్, టీఆర్‌పీ రేటింగుల కోసం ఈ ఘటనపై తీవ్రంగా -అతి- చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైజాగ్‌లో భారీ భూకంపం అంటూ దారుణమైన, భయానకమైన హెడ్డింగులతో లైవ్ ప్రోగ్రామ్‌లు, తప్పుడు థంబ్‌నైల్స్ పెట్టి సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో హల్చల్ చేయడం స్థానిక ప్రజలకు అస్సలు నచ్చడం లేదు. వాస్తవ తీవ్రతను దాచిపెట్టి... కేవలం క్లిక్ బైట్స్- విజిబిలిటీ పెంచుకోవాలనే కొన్ని మీడియా ఛానెళ్ల మూర్ఖత్వాన్ని నెటిజన్లు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు. ఇలా మీడియా అతి చేయడం విశాఖ విషయంలో ఇదే మొదటిసారి కాదు. ఇటీవల పరవాడ పరిసరాల్లోని ఫార్మా కంపెనీలలో జరిగిన కొన్ని చిన్నపాటి, చెదురుముదురు ప్రమాదాలపైనా కొన్ని మీడియా సంస్థలు ఇలాగే ఘోరమైన హెడ్డింగులు పెట్టి టీఆర్‌పీ గేమ్స్ ఆడటానికి ప్రయత్నించాయి. పరిశ్రమల్లో జరిగిన చిన్న సాంకేతిక లోపాలను కూడా నగరానికేదో ముప్పు ముంచుకొచ్చినట్లు కలరింగ్ ఇస్తూ వార్తలు ప్రసారం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పకుండా అబద్ధపు హైప్ క్రియేట్ చేయడం బాధ్యతారాహిత్యమే అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు లేదా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ధైర్యం చెప్పడం మీడియా ప్రాథమిక బాధ్యత. అంతేకాని చిన్నపాటి స్వల్ప ప్రకంపనలను కూడా భారీ భూకంపాలుగా చిత్రీకరించి సమాజంలో అనవసర భయాందోళనలు సృష్టించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేస్తూ..బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు మీడియా అడుగులు వేయాలని..రేటింగుల పిచ్చిని పక్కనపెట్టి వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుంచాలని విశ్లేషకులు హితవు పలుకుతున్నారు.

**భూకంపంపై ప్రజా స్పందన :** విశాఖపట్నం తీరంలో సంభవించిన స్వల్ప భూప్రకంపనలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు భిన్నమైన అనుభవాలను, అభిప్రాయాలను షేర్ చేస్తున్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం, మధురవాడ, సీతమ్మధార, ఎన్‌ఏడి, కూర్మన్నపాలెం.. అలాగే విజయనగరం వంటి పరిసర ప్రాంతాల ప్రజలు తెల్లవారుజామున 5:00 నుండి 5:15 గంటల మధ్యలో తమకు ఎదురైన అనుభవాలను లైవ్ చాట్‌లో రాసుకొచ్చారు. కొందరు నిద్రలో ఉన్నప్పుడు వింత శబ్దాలు వచ్చాయని.. మరికొందరు బెడ్‌రూమ్‌లోని మంచం, అల్మారా కొన్ని సెకన్ల పాటు కదిలాయని పేర్కొన్నారు. ఉదయాన్నే పూజ చేసుకుంటున్న సమయంలో లైట్‌గా షేక్ అవ్వడంతో మొదట భ్రమ అనుకున్నామని... కానీ మీడియా లైవ్ చూశాకే అది భూకంపమని తెలిసిందని కొందరు నెటిజన్లు ధృవీకరించారు. ఈ ప్రకంపనలపై కొందరు నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం ఇది చాలా స్వల్ప తీవ్రత కలిగింది..అంతా పిచ్చ లైట్, భయపడాల్సిన పనిలేదు- అంటూ ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో ఈ ప్రకృతి పరిణామాన్ని కొందరు దైవచింతనతో - పాపపుణ్యాలతో ముడిపెడుతూ కామెంట్లు చేయడం గమనార్హం. సమాజంలో పాపాలు పెరిగిపోవడం వల్లే భగవంతుడు ఇలాంటి హెచ్చరికలు ఇస్తున్నాడని... ఇప్పటికైనా మనుషులు మంచితనంతో నడుచుకోవాలని దైవభక్తితో కూడిన హితవులు పలికారు. మొత్తానికి మీడియా చూపిస్తున్న అతితో సంబంధం లేకుండా, నెటిజన్లు తమ స్వంత అనుభవాలను షేర్ చేయడంతో వాస్తవం ఏమిటో అవగతమవుతోంది.

# బాబు మిత్రులందు పవన్ వేరయా..!



ఏపీ సీఎం చంద్రబాబు రాజకీయ జీవితం ఒక అర్ధ శతాబ్దం. ఇంతటి సుదీర్ఘ జీవితంలో బాబుకు ఎంతో మిత్రులు ఉన్నారు. ఆయన ప్రతీ దశలోనూ వారి కనిపిస్తూ ఉంటారు. తొలినాళ్ళలో వైఎస్సార్ బాబు మంచి మిత్రులు. ఇద్దరూ ఒకేసారి ఎమ్మెల్యేలుగా నెగ్గారు, ఒకేసారి మంత్రి పదవులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అందుకున్నారు. ఆ తరువాత బాబు టీడీపీలోకి వెళ్తే వైఎస్సార్ కాంగ్రెస్ లోనే ఉన్నారు. ఇక టీడీపీలో కూడా బాబుకు సహచరులలో మంచి మిత్రులు ఉన్నారు. అశోక్ గజపతిరాజు, ఎర్రన్నాయుడు, యనమల రామక్రిష్ణుడు, అయ్యన్నపాత్రుడు వంటి వారు బాబుకు అత్యంత సన్నిహితులు అలాగే మిత్రులుగా చెప్పుకోవాలి. ఇక టీడీపీకి కూడా మిత్రులు ఉన్నారు. అవన్నీ రాజకీయ బంధాలు. ఒక ఎన్నికలో మిత్రులుగా ఉండే పార్టీలు మరో ఎన్నికలో ప్రత్యర్ధిగా మారుతాయి.

**మిత్ర పక్షాలతో బంధం :** ఇదిలా ఉంటే టీడీపీ తొలి మిత్ర పక్షం ఇందిరాగాంధీ చిన్న కోడలు మేనకా గాంధీ స్థాపించిన సంజయ్ విచార్ మంచ్. 1983లోనే పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఆ తరువాత బీజేపీ వామపక్షాలు అలా తలో ఎన్నికల్లో మిత్రులుగా ఉంటూ వచ్చాయి. ఈ మధ్యలో టీఆర్ఎస్ కూడా టీడీపీకి ఒక అసాధారణ సందర్భంలో దోస్త్ గా మారింది. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా పార్టీ పెట్టిన టీడీపీకి మరో అనూహ్య సందర్భంలో ఆ పార్టీ కూడా మిత్ర పక్షం అయింది అంటే అదంతా రాజకీయ అనివార్యతగా రాజకీయ సహజ ప్రక్రియగానే తీసుకోవాల్సి ఉంది.

**పవన్ మాత్రం ప్రత్యేకం :** అయితే ఇంతలా మిత్ర బంధాలు నెరపిన టీడీపీకి పవన్ మాత్రం మిత్రుడు కంటే ఎక్కువ అనే చెప్పాలి. పవన్ 2014లో టీడీపీకి జనసేన అధినేత కంటే కూడా ఒక మిత్రుడిగానే బాసటగా నిలిచారు. ఇక 2019 నాటికి జనసేన వేరుగా పోటీ చేసి టీడీపీకి ప్రత్యర్ధిగా మారింది. అయితే 2024 నాటికి మళ్ళీ టీడీపీ కూటమిలో చేరింది. ఈ పన్నెండేళ్ళ ప్రస్థానంలో టీడీపీ జనసేనల అన్న పార్టీల కంటే కూడా బాబు పవన్ ల వ్యక్తిగత స్నేహ బంధం గట్టిగా నిలిచింది. 2018 నుంచి ఒక ఏడాది పాటు మాత్రమే పవన్ బాబు ప్రత్యర్థులుగా మారారు అంతే.

**అరుదైన స్నేహంగానే :** రాజకీయ పార్టీల మిత్రృత్వం సాధారణంగా ఎన్నికల ముందు తరువాత అని మాత్రమే చూడాలి. ఎన్నికలు ముగిసాక ఆ బంధంలో మార్పులు వస్తాయి. అలాగే రాజకీయాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే జనసేన టీడీపీ విషయంలో వీటికి మించి అతీతమైన అనుబంధం ఉంది. అదే శ్రీరామ రక్షగా నిలుస్తోంది. ఏపీ అభివృద్ధికి తొలి ప్రాధాన్యత పవన్ ఇస్తారు. అలాగే చంద్రబాబుని ఆయన మంచి పాలకుడిగా పవన్ గుర్తిస్తారు. అలాగే పవన్ లోని నిబద్ధతకు బాబు సైతం ఆకర్షితులు అవుతున్నారు. ఆయన అందరి లాంటి మిత్రుడు కాదు అన్నది కూడా బాబు గుర్తించి మరీ ఆయనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు.

**పవన్ కోసం బాబు :** పవన్ కళ్యాణ్ ఇటీవల ముంబైలోకి కోకిలాబెన్ ఆసుపత్రిలో తన భుజానికి శస్త్ర చికిత్స చేసుకున్నారు. చంద్రబాబు ప్రత్యేకంగా పనిగట్టుకుని ఆసుపత్రికి వెళ్ళి మరీ పవన్ ని పరామర్శించడం ఈ ఇద్దరి మధ్య అనుబంధాన్ని చాటి చెబుతోంది. చంద్రబాబు పవన్ ఆరోగ్యం విషయంలో చూపించిన శ్రద్ధ కూడా ఈ సందర్భంగా అంతా చెప్పుకుంటున్నారు. ఒక మిత్ర పక్షం నాయకుడు కోసం బాబు ఇలా వెళ్ళడం అన్నది రాజకీయాలకు అతీతంగా వారిద్దరి మధ్య ఉన్న బంధాన్ని చాటుతోంది.

**ఈ బంధం గట్టిది మరి :** చంద్రబాబు పవన్‌ల మధ్య ఏజ్ గ్యాప్ ఉంది. అనుభవం విషయం తీసుకుంటే బాబు అత్యంత సీనియర్. అదే సమయంలో ఇద్దరి మధ్య ఒక సారూప్యత ఉంది. అదే ఏపీ అభివృద్ధి అన్నది. ఈ లక్ష్యం కోసం ఇద్దరూ చేతులు కలిపారు. అందుకే ఈ బంధం బహు గట్టిగా మారింది అని అంటున్నారు. ఇక చంద్రబాబు విషయంలో ఒక విమర్శ ఉంది, మిత్రులను ఆయన రాజకీయంగా సాయం తీసుకుని ఆనక పట్టించుకోరు అని. దానికి పూర్తి విరుద్ధం జనసేనతో బంధం. ఈ రెండు పార్టీల మధ్య దృఢమైన బంధానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తాజాగా బాబు పరామర్శ దానిలో ఒకటిగా చెబుతున్నారు.

# 175/175.. పవన్ సరికొత్త వ్యూహం!



ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు. ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్లు పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

# పెద్దాయన రాయలసీమ గళం విప్పుతారా..?

ఏపీలో అతి ముఖ్యమైన రీజియన్ గా రాయలసీమ ఉంది. రాయలసీమ ప్రాంతం ఆంధ్ర రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి మద్రాస్ స్టేట్ లో ఉండేది. అయితే ప్రత్యేక రాష్ట్రంగా ఏపీ ఆవిర్భవించాలనుకున్నపుడు మొదట్లో రాయలసీమ కలసిరాలేదు. మాకు మద్రాస్ స్టేట్ తో బాగానే ఉంది అని కూడా అనుకుంది. చివరికి శ్రీభాగ్ ఒప్పందం మేరకు రాయలసీమ కూడా కలసి వచ్చింది. దాని ప్రకారం చూస్తే కొత్త స్టేట్ లో రాజధాని అయినా లేదా హైకోర్టు అయినా తమకు ఉండాలని కోరినట్లుగా ఒప్పందంలో ఉంది. ఇక 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూల్ రాజధాని అయింది. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు అయింది. తిరిగి 2014లో ఉమ్మడి ఏపీ విడిపోయినపుడు రాజధాని అయినా హైకోర్టు అయినా ఏదో ఒకటి దక్కాలని అనుకున్న అది జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అంతే కాదు రాయలసీమను రతనాల సీమను చేస్తామని కూడా చెబుతూ ఆ దిశగా చర్యలను చేపడుతోంది.

**సాగు నీటి ప్రాజెక్టులు :** అదే విధంగా చూస్తే రాయలసీమకు సాగు తాగు నీటి కొరత ఉంది. వాటి విషయంలో పాలకులు ఆలోచన చేయాలని కూడా ఉంది. అలాగే ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఉపాధి అవకాశాలు మాత్రం పెద్దగా పెరగడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు వస్తున్నాయని అంటున్నా రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని



అంటున్నారు. దాంతో రాయలసీమ విషయంలో ఇంకా అసంతృప్తి స్వరాలు గట్టిగా వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి మైసూరారెడ్డి అయితే రాయలసీమ విషయంలో తన స్థిరరమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక యూ ట్యూబ్ చానల్ లో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు తగిన న్యాయం జరగాలని కోరుకున్నారు.

**ఇద్దరూ ఏమీ చేయలేదు :** రాయలసీమ ప్రాంతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ మాజీ సీఎం వైఎస్ జగన్ కానీ ఏమీ చేయలేదని మైసూరారెడ్డి విమర్శించారు. రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. వాటి కోసం అంతా కృషి చేయాలని పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే రాయలసీమ సమస్యల పట్ల మళ్ళీ తన గళాన్ని వినిపించాలని మైసూరారెడ్డి ఆలోచిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. రాయలసీమ అభివృద్ధి మీద అయితే ఇప్పటికీ అంతా అసంతృప్తిగానే ఉన్నారు. పాలకులు మారినా ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా వెనకబాటు తనం పోవడం లేదన్న బాధ అయితే అందరిలో ఉంది.

**రాజకీయాలకు దూరంగా :** ఇక మైసూరారెడ్డి చూస్తే రాజకీయాలకు దూరంగానే ఉంటూ వతున్నారు. ఆయన రాజకీయ జీవితం బాగా వెలిగింది కాంగ్రెస్ పార్టీలోనే అని గుర్తు చేస్తున్నారు. 1983 నుంచి మూడు సార్లు వరసగా కమలాపురం నుంచి గెలిచిన మైసూరారెడ్డి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో హోం మంత్రిగా పనిచేశారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో కూడా పనిచేశారు. ఆ తరువాత మూడున్నర దశాబ్దలౌగా చూస్తే ఆయన రాజకీయంగా కీలక పదవులలో లేరు. మధ్యలో టీడీపీలో చేరి ఒకసారి రాజ్యసభకు వెళ్ళారు. వైసీపీలో చేరినా ఆయనకు అధికార పదవులు దక్కలేదు. మొత్తానికి పదేళ్ళుగా రాజకీయాలు దూరంగా ఉంటున్న ఆయన రాయలసీమ సమస్యల మీద ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. మరి ఆయన కనుక రంగంలోకి దిగితే రాజకీయం అక్కడ ఏ విధంగా మారుతుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# అత్తా-కోడళ్ల మధ్య ఘర్షణ..

## స్లీపింగ్ టాబ్లెట్లు మింగిన అత్తను కాపాడిన పోలీసులు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని జగన్నాథపురంలో అత్తా-కోడళ్ల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఓ మహిళ స్లీపింగ్ టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జగన్నాథపురానికి చెందిన గేదెల హేమలతకు శుక్రవారం రాత్రి తన కోడలితో మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది.దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హేమలత గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని స్లీపింగ్ టాబ్లెట్లు మింగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర సేవల 112 నంబర్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న రాత్రి విధుల్లో ఉన్న కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మజ్జి జగదీష్,హోంగార్డు వీరభద్రరావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని లోపల నుంచి లాక్ చేసిన గది తలుపును బలవంతంగా తెరిచి హేమలతను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సకాలంలో స్పందించిన పోలీసుల కారణంగా హేమలత ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు సమాచారం. వెంటనే స్పందించి ఆమె ప్రాణాలను కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు, పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# వైఎస్ జగన్‌కు క్షమాపణలు తెలిపిన ఆర్టిస్ట్ సునీల్.. వెనక్కి తగ్గిన సోషల్ మీడియా స్టార్

సోషల్ మీడియాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అనుకరిస్తూ మిమిక్రీ చేస్తూ విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఆర్టిస్ట్ సునీల్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. గత కొంతకాలంగా తెలుగుదేశం పార్టీ అధికారిక, అనుబంధ సోషల్ మీడియా వేదికల్లో పొలిటికల్ సెటైర్ వీడియోల ద్వారా ఆయన బాగా పాపులర్ అయ్యారు. జగన్ హావభావాలు.. మాట్లాడే శైలిని దించుతూ సునీల్ చేసిన వీడియోలు నెట్టింట విపరీతంగా వైరల్ అయ్యాయి. అయితే తాజాగా ఆయన విడుదల చేసిన ఒక సెల్ఫీ వీడియో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### వివాదానికి కారణం ఏమిటి?

రాజకీయ వ్యంగ్యం పరిధి దాటి వ్యక్తిగత విమర్శలకు దారితీయడమే ఈ వివాదానికి ప్రధాన కారణం. ఇటీవల విడుదలైన కొన్ని వీడియోల్లో ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ సతీమణి వైఎస్ భారతి రెడ్డిని ఉద్దేశించి రూపొందించిన కంటెంట్‌పై వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ ఇంట్లోని మహిళలను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్య వీడియోలు రూపొందించడం సంస్కారం కాదంటూ వైసీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున మండిపడ్డాయి. ఈ అంశంపై నెటిజన్ల మధ్య కూడా తీవ్రస్థాయిలో చర్చ నడిచింది.





### సెల్ఫీ వీడియోలో సునీల్ ఏమన్నారంటే..?

పరిణామాలు తీవ్రరూపం దాల్చడంతో ఆర్టిస్ట్ సునీల్ స్వయంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. "నా వీడియోల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే అందుకు నేను మనస్ఫూర్తిగా చింతిస్తున్నాను. ముఖ్యంగా వివాదానికి కారణమైన వీడియోలపై స్పందిస్తూ.. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా జాగ్రత్త పడతాను." అని సునీల్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఇకపై కంటెంట్ రూపొందించేటప్పుడు మరింత బాధ్యతతో వ్యవహరిస్తానని.. వ్యక్తిగత స్థాయిలో ఎవరినీ నొప్పించే విధంగా, కుటుంబ సభ్యులను లాగే విధంగా వీడియోలు చేయనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ క్షమాపణల వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతోంది.

### నెటిజన్ల భిన్నాభిప్రాయాలు

సునీల్ క్షమాపణలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. తప్పును తెలుసుకుని, పెద్ద మనసుతో క్షమాపణలు చెప్పడం మంచి పరిణామమని కొందరు సునీల్‌ను అభినందిస్తున్నారు. అసలు మొదట్లోనే రాజకీయాల కోసం ఒకరి వ్యక్తిగత జీవితాలను, కుటుంబ సభ్యులను విమర్శించే స్థాయికి దిగజారకుండా ఉండాల్సిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ వ్యంగ్యం, అనుకరణలు సహజమే అయినప్పటికీ, వాటికి కూడా కొన్ని హద్దులు ఉంటాయనే విషయాన్ని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ఏది ఏమైనా ఆర్టిస్ట్ సునీల్ క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదానికి ప్రస్తుతానికైతే తెరపడినట్లు కనిపిస్తోంది. భవిష్యత్తులో సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండటానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## పంచాయితీ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు పైప్ లైన్ వేస్తే

# వారి సొంతం అవుతుందా?

### సంబంధిత అధికారులకు అజమాయిషి ఉండదా? పన్నులు చెల్లించినప్పుడు వసతులు కల్పించరా?



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో గ్రామ పంచాయతీకి సంబంధించిన వీధుల్లో పంచాయతీ అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులు పైప్ లైన్ నిర్మిస్తే అది వారికే పరిమితం అవుతుందా? సంబంధిత అధికారులకు, ఆ వీధిలోని ప్రజలకు దానిపై హక్కు ఉండదా? ఇలా పలు సమస్యలతో కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు సతమతమవుతున్నారు. సంబంధిత అధికారులు ఇటువంటి వ్యవహారాల్లో పక్కాగా కచ్చితత్వంతో వ్యవహరించకపోడంతో మురుగునీరు విషయాల్లో నిర్లక్ష్యం వహించడం వల్ల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ములకు తూట్లు పడుతూ, ప్రజల మధ్య అగాదాలు ఎక్కువవుతున్నాయి. సంబంధిత అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చినప్పుడు ఆ సమస్యపై దృష్టి కేంద్రీకరించి, భవిష్యత్తులో మరల అటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందు చూపుతో తగు చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో సంబంధిత అధికారులు అటి ముట్టనట్టుగా వ్యవహరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇంటి పనులు, డ్రైనేజ్, కుళాయిలు, గ్రంథాలయాలకు సంబంధించిన పన్నులు ప్రజల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నప్పుడు, ప్రజలకు ఆ సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత సంబంధిత అధికారిపై లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు ముందుగా ప్రజలకు అవసరమైన సౌకర్యాల త్రాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ, మరో వైపు పంచాయతీలో నిధులు లేవంటూ చేతులు దులుపు కోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇటువంటి సమస్యలు మరిన్ని ఉత్పన్నమవుతున్న, అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో ప్రజారోగ్యం పై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇకనైనా ఇటువంటి సమస్యలపై అధికారులు ముందస్తుగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## బైక్‌తో చెట్టును ఢీకొని

# ముగ్గురు యువకులు మృతి

### శోక సముద్రంలో గాదరాడ - మితిమీరిన వేగం ప్రాణాలను బలికొంది

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్ పై వెళుతూ అదుపుతప్పి చెట్టును తీవ్రంగా ఢీకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కోరుకొండ ఎస్సై వెంకట రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం రాత్రి గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైకుపై కోరుకొండ వస్తుండగా, మార్గం మధ్యలో నరసాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద టర్నింగ్ లో బైకును అదుపు చేయలేక చెట్టును ఢీ కోవడంతో బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గాదరాడ గ్రామానికి చెందిన బక్క అంజన్న(30) సారిపల్లి వీర దుర్గ(26) గుర్రం నాగు(24) మృతి చెందడంతో గాదరాడ గ్రామం శోక సముద్రంలో మునిగింది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబలలో ముగ్గురు యువకులు చనిపోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ వద్ద తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## హ్యూమన్ రైట్స్‌పై

# ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

### కోరుకొండలో హ్యూమన్ రైట్స్ జిల్లా సమావేశంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మోజు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోరం ఫర్ ఆర్‌టిఐ & హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశం కోరుకొండలో జిల్లా అధ్యక్షులు జి.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం అయిందని సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ తెలిపారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా వ్యాప్తంగా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సభ్యులతో పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డా కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం మానవ హక్కులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం సంఘ సభ్యులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకొని ప్రభుత్వ సేవలను సక్రమంగా పొందేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, హ్యూమన్ రైట్స్ వర్క్‌షాప్‌లు, యువజన మరియు మహిళా చైతన్య సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, రాజ్యాంగ విలువల ప్రచారం, ప్రముఖుల జయంతులు, వర్ధంతి కార్యక్రమాలను జిల్లా స్థాయిలో నిర్వహించాలని వెల్లడించారు. సంస్థ బలోపేతానికి ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్‌టిఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా సభ్యులకు ప్రత్యేక శిక్షణ అందించ నున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు జి రాజు మాట్లాడుతూ జాతీయ చైర్మన్ సూచించిన కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా మరియు మండల స్థాయి సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోద్దు శివరామకృష్ణ, పి ఎస్ కే ఎల్ వి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముగింపు దశకు ఎస్ఐఆర్

### మరో రెండు రోజులే గడువు : డిప్యూటీ కలెక్టర్ తంగెళ్ల రాజేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్ఐఆర్ కార్యక్రమం మరో రెండు రోజుల్లో ముగుస్తుందని మండపేట నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తంగెళ్ల రాజా రాజేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్ష సమావేశం జరిగింది. మండపేట అర్బన్ ఏఇ ఆర్ఓ కమీషనర్ టివి రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపేట ఎన్నికల నమోదు అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.రాజేశ్వరరావు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఇప్పటివరకు సేకరించిన ఓట్ల డిజిటలైజేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మరో 2 రోజుల్లో ముగుస్తుందని తెలిపారు. మిగిలి ఉన్న ఓట్ల వివరాలను వెంటనే డిజిటలైజ్ చేసి, క్షేత్రస్థాయిలో 100% పరిశీలించి గుర్తించాలని సూచించారు. ట్రేస్ కానీ,గుర్తించ లేని ఓటర్లు, మరణించిన ఓటర్లు డబుల్ ఎంట్రీలను గుర్తించాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల బిఎల్ఏ లతో సమన్వయంతో ఓట్ల నమోదు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.ఈ సమావేశంలో ఏ ఇ ఆర్ ఓ లు, సూపర్‌వైజర్లు, బి.ఎల్.ఓలు పురపాలక సిబ్బంది, డి ఇ కింతాడ శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాస్ స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్, ఆర్ ఓ మాచిరాజు రవి, ఆర్ఐ కొత్తపల్లి సత్తిబాబు,శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ, ఏఇ లు దాసరి పవన్, అనూష లక్ష్మీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా

# రామ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా బివిఎస్ రామ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే కళాశాలలో గణిత శాస్త్ర లెక్చరర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## పెందుర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన పెనకటి




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టూర్ ప్రోగ్రాం కన్వీనర్ రాజనగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్‌ను కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని రోడ్లు, భవనాలశాఖ గెస్ట్ హౌస్‌లో వెంకటేష్‌ను, గంగాధర్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ప్రస్తుతం విద్యాశాఖలోని మార్పులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు సరదాగా ముచ్చటించారు. అనంతరం వెంకటేష్ ను సాల్వతో సత్కరిస్తూ, అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి చిన్నారి,కట్టా సత్తిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా కోరల్లో

# రఘుదేవపురం ఊర చెరువు

### పట్టించుకోని అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో ఉన్న ఊర చెరువు ఆక్రమణకు గురవుతోంది.ఏళ్ల తరబడి పంట సాగుకు, మరియు రఘుదేవపురం గ్రామం అధిక వర్షాల వలన ముంపుకు గురికాకుండా అప్పటి అధికారులు ఏర్పాటు చేసిన ఊర చెరువుని అయినంపూడి న సీతారామయ్య, అడపా రాజు అనే వ్యక్తులు పశువుల పెంటతో సర్వేనెంబర్ 51 గల చెరువును పూడ్చుకుంటూ చెరువును కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే అక్రమ నిర్మాణాలను చేపడుతూ ఆక్రమించుకుంటున్నారని,12 ఎకరాలు ఉన్న ఈ చెరువు సగానికి సగం కబ్జాకు గురైందని స్థానికులు చెబుతున్నారు. జల వనరులను కబ్జా చేయడం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నేరమని తెలిసినా ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నారు. గతంలో ఈ చెరువు కబ్జాపై ఫిర్యాదులు రావడంతో మండల అధికారులు హడావిడి చేశారే తప్ప ఆక్రమణలు తొలగించలేదు.ఈ చెరువు రక్షణ బాధ్యత పూర్తిగా రెవిన్యూ, నీటి పారుదల శాఖ,పంచాయతీ అధికా రుదే అయినా ఇదంతా తెలి సినా చూచీ చూడనట్లు వ్యవ హరిస్తు న్నారని ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. కబ్జాకు గురవుతున్న ఈ చెరువు భూమి ఎంత ఉందో గుర్తించి సర్వే చేసి హద్దులు రికార్డుల పరంగా రెవెన్యూ ఇరిగేషన్,పంచా యతీ శాఖ అధికారులు సంయుక్తంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్ట వలసిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోకుండా మూ గజీవాలకు,పశుపక్షాదులకు ఈ ఊర చెరువు నందు నీరు దొరకని పరిస్థితి తలెత్తకుండా ఇప్పటికైనా రెవెన్యూ,ఇరిగేషన్, పంచాయితీ అధికారులు కబ్జా దారుల కోరల్లో చిక్కుకున్న చెరువు భూమిని స్వాధీ న పరచుకుని పశువుల పెంటను ప్రతిరోజూ వేస్తున్న కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్బీఐ ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంఘం (సేవ)

# అమరావతి సర్కిల్ సేవలు ప్రశంసనీయం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (సేవ) అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో "రైజ్ యాజ్ ఎ లీడర్" పేరుతో నాయకత్వ శిక్షణా కార్యక్రమం రాజమహేంద్రవరం లోని రిషితా గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహార్ మాట్లాడుతూ, ఎస్బీఐలోని ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులు అత్యంత నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ బ్యాంకు అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అదే సమయంలో సేవఅమరావతి సర్కిల్ ఉద్యోగుల సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజా నికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశం సించారు. బ్యాంకర్లు తమ వృత్తి బాధ్యతలతో పాటు దళితుల అభ్యు న్నతి, సామాజిక న్యాయం, సమాజ అభి వృద్ధి కోసం మరింత చొరవతో పనిచేయా లని పిలుపునిచ్చారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్, కవి, ప్రముఖ వక్త శ్రీ ఎం.సతీష్ చంద్ర నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, జట్టు నిర్మాణం, బాధ్యతాయుతమైన నాయకత్వం వంటి అంశాలపై స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో సేవ జనరల్ సెక్రటరీ మేడికొండ సునీల్, అధ్యక్షులు కె. సతీష్, డీజీఎస్ బి.అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీ/ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు, పదాధికారులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ నాయకత్వ శిక్షణా కార్యక్రమం ఉద్యోగుల్లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, సంస్థాభివృద్ధి, సమాజ సేవలో మరింత చురుకైన పాత్ర పోషించేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.


## మయూరి వృద్ధాశ్రమంలో

# వేగుళ్ళ అనితమ్మ జన్మదిన వేడుకలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ సతీమణి వేగుళ్ళ అనితమ్మ జన్మదినం సందర్భంగా ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండపేటలోని మయూరి వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు, ఆశ్రమానికి 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే వృద్ధులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమను ఆప్యాయంగా ఆదరించి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సేవాభావంతో తమ గురించి ఆలోచించిన వేగుళ్ళ అనితమ్మకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండి నూరేళ్లు జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు.






జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ హోస్ట్‌గా మరో రియాలిటీ షో ప్రారంభమైంది. ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోన్న ది టాప్ తెలుగు ఇన్ ఫ్లూయెన్సర్ అనే ట్యాలెంట్ హంట్ షోకు రష్మీ యాంకర్ గా వ్యవహరిస్తోంది. ఈ షో ప్రమోషన్స్‌లో పాల్గొన్న రష్మీ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆ సమస్యలతో బాధపడుతున్నా.. అందుకే ఇలా కనిపిస్తున్నా.. ఓపెన్‌గా చెప్పేసిన జబర్దస్త్ యాంకర్ జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ హోస్ట్ గా మరో రియాలిటీ షో ప్రారంభమైంది. ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోన్న ది టాప్ తెలుగు ఇన్ ఫ్లూయెన్సర్ అనే ట్యాలెంట్ హంట్ షోకు రష్మీ యాంకర్ గా వ్యవహరిస్తోంది. ఈ షో ప్రమోషన్స్‌లో పాల్గొన్న రష్మీ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'నిజం చెప్పాలంటే నాకు ఇలా కనిపించడం అస్సలు ఇష్టం ఉండడం లేదు. కెమెరా ముందు కనిపించే లుక్ వాస్తవానికి భిన్నంగా ఉంటుంది. కెమెరాల వల్ల కూడా కొంతమంది రియల్ కంటే ఇంకా లావుగా కనిపిస్తారు. అయితే నేను ఇలా కనిపించడానికి ప్రధాన కారణం నాకున్న కొన్ని ఆరోగ్య సమస్యలు. ఆ సమస్యల ప్రభావం వల్లే నా శరీరంలో మార్పులు వచ్చాయి. అందుకే ఇప్పుడు కాస్త బొద్దుగా కనిపిస్తున్నాను. అయితే ఈ పరిస్థితి కూడా శాశ్వతం కాదు. ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించాను. ఆరోగ్య సమస్యల నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తాను. గత 20 ఏళ్లుగా ఈ సినిమా ఇండస్ట్రీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, అపజయాలు రెండింటిని ఫేస్ చేశారు. అయినప్పటికీ ప్రతి అనుభవం నాకు కొత్త పాఠం నేర్పింది. అందుకే జీవితంలో ఎలాంటి కఠిన పరిస్థితులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవడం అలవాటు అయింది' అని చెప్పుకొచ్చింది రష్మీ. ప్రస్తుతం ఈ జబర్దస్త్ యాంకర్ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

# తల్లి మళ్లీ పెళ్లి చేసుకుంటే తప్పేంటి?

## ఓటీటీలోకి విజయ్ ఆంటోని లేటెస్ట్ సినిమా.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?



బిక్షగాడు సినిమాతో తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు విజయ్ ఆంటోని. తమిళంలో అతను నటించిన ప్రతి సినిమా తెలుగులోనూ రిలీజ్ అవుతోంది. అలా విజయ్ ఆంటోని ప్రధాన పాత్రలో తెరకెక్కిన లేటెస్ట్ సినిమా 'వంద దేవుళ్లు'. బిక్షగాడు సినిమాను తెరకెక్కించిన డైరెక్టర్ శశినే ఈ మూవీకి దర్శకత్వం వహించాడు. బిక్షగాడు లాంటి సూపర్ హిట్ సినిమా తర్వాత హీరో విజయ్ ఆంటోనీ, డైరెక్టర్ శశి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా 'వంద దేవుళ్లు'. (తమిళంలో 'నూరు సామి' గా రిలీజైంది). జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా డీసెంట్ హిట్‌గా నిలిచింది. కమర్షియల్‌గా వసూళ్లు సాధించకపోయినా కంటెంట్ పరంగా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, సర్వంత రామ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ ఆంటోని, రామాంజనేయులు జువ్వాజి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. విజయ్ ఆంటోనితో పాటు శ్వాసిక, అజయ్ దిషాన్, లిజోమోల్ జోసే, శక్తి, కావ్య అనిల్, కరుణాస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. థియేటర్లలో ఓ మోస్తరుగా ఆడిన వంద దేవుళ్లు సినిమా ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ 5 సొంతం చేసుకుంది. జులై చివరి వారంలో కానీ ఆగస్ట్ మొదటి వారంలో కానీ ఈ సినిమా స్ట్రీమింగ్ అయ్యే ఛాన్స్ ఉంది. త్వరలోనే అఫీషియల్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు. అప్పుడెప్పుడో తెలుగులో మా నాన్నకు పెళ్లి అనే సినిమా వచ్చింది.. అందులో శ్రీకాంత్ తన తండ్రి కృష్ణంరాజుకు మరో పెళ్లి చేస్తాడు. ఈ సినిమా కథ కూడా అంతే.. 'తోడు లేని తల్లికి మళ్లీ పెళ్లి చేస్తే తప్పేంటి' అనే ఎమోషనల్ పాయింట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. వాసవి (శ్వాసిక)కి 26 ఏళ్లు ఉన్నప్పుడే భర్త చనిపోతాడు. తన ఇద్దరు కొడుకులను ఒంటరిగా పెంచి పోషిస్తుంది. అయితే ఒంటరి మహిళ కావడంతో ఉళ్లో ఉన్న కొందరూ వాసవితో తప్పుగా ప్రవర్తిస్తుంటారు. దీంతో పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేసిన వాసవి, జీవితంలో తను కూడా మళ్లీ ఇంకో దశ మొదలుపెట్టాలనుకుంటుంది. మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకుంటుంది. కానీ వాసవి పెద్ద కుమారుడు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. అలాంటి సమయంలో వాసవి జీవితంలోకి ఏడుకొండలు (విజయ్ ఆంటోనీ) వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే వంద దేవుళ్లు సినిమా కథ.

# రాత్రి పడుకునే ముందు ఆ ఒక్కటి తప్పకుండా తింటా.. లేదంట నిద్రపట్టదు.. నాగార్జున..



నాగార్జున తన ఫిట్‌నెస్ వెనుక ఉన్న రహస్యాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. నిజానికి ఆయన లుక్స్, ఫిట్నెస్ గురించి తెలుసుకోవడానికి నెటిజన్స్ తెగ ట్రై చేస్తుంటారు. ఆరు పదుల వయసులోనూ కుర్ర హీరోలకు పోటీగా ఫిట్నెస్ మెయింటైన్ చేస్తున్నారు నాగ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన డైట్ గురించి చెప్పుకొచ్చారు. టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున లుక్స్, ఫిట్నెస్ ఎప్పుడూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తూనే ఉంటాయి. ఆరు పదుల వయసులోనూ ఏమాత్రం తగ్గని అందంతో ఇప్పటికీ ఆకట్టుకుంటారు. అయితే గతంలో నా సామి రంగా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ రహస్యాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. ఇప్పుడు ఆయన చేసిన కామెంట్స్ మరోసారి వైరలవుతున్నాయి. ఆ ఇంటర్వ్యూలో తన వృత్తికి ఫిట్‌నెస్ ఎంత అవసరమో ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కేవలం మన్మథుడు అనే బిరుదు కోసమో కాకుండా, తన పనిని సమర్థవంతంగా నిర్వహించడానికి శారీరక, మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. నాగార్జున తన ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ, తన శరీరాన్ని ఎప్పుడూ ఆహారం విషయంలో డిప్రైవ్ చేయనని స్పష్టం చేశారు. "కడుపు నిండా తింటానండి. డిప్రైవ్ మాత్రం చేయనండి నా బాడీని ఫుడ్ గురించి" అని ఆయన తెలిపారు. తన రోజువారీ ఆహారంలో సమతుల్యత ఉండేలా చూసుకుంటానని, బ్రౌన్ రైస్, నెయ్యి, మూడు రకాల ఆకుకూరలు, చికెన్ లేదా ఫిష్, పెరుగు, తొక్కు పచ్చడి వంటివి తన భోజనంలో ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా, తెల్ల అన్నానికి బదులుగా బ్రౌన్ రైస్ తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. రాత్రి భోజనం విషయానికి వస్తే, ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటలకల్లా డిన్నర్ పూర్తి చేసుకుంటానని, ఇది తన చాలా కాలంగా పాటిస్తున్న నియమమని పేర్కొన్నారు. ఆహారంతో పాటు వ్యాయామం ప్రాముఖ్యతను కూడా నాగార్జున వివరించారు. ఉదయం పూట వర్కవుట్స్ చేయడం వల్ల శరీరంలో మెటబాలిజం హైకి వెళు ుందని, దీనివల్ల రోజంతా కేలరీలు బర్న్ అవుతూ ఉంటాయని ఆయన తెలిపారు. "మెటబాలిజం హైలో ఉందంటే బర్న్ చేస్తూనే ఉంటది, ఇలా కూర్చున్నప్పుడు కూడా" అని ఆయన అన్నారు.

# క్రికెట్ మక్కాలో భారతీయుల హవా..

## యస్తికా భాటియా రికార్డ్ సెంచరీ, 5 వికెట్లతో క్రాంతి గౌడ్ విధ్వంసం




లార్డ్స్ టెస్టులో యస్తికా భాటియా చారిత్రాత్మక సెంచరీ, క్రాంతి గౌడ్ రికార్డు 5 వికెట్లతో భారత్ మహిళల జట్టు ఇంగ్లండ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యంతో విజయానికి చేరువైంది. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక ప్రతిష్టాత్మక టెస్ట్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు చారిత్రాత్మక ప్రదర్శనతో అదరగొడుతోంది. మ్యాచ్‌లో మూడో రోజైన ఆదివారం నాటి ఆటలో భారత బ్యాటర్ యస్తికా భాటియా అద్భుత సెంచరీతో చెలరేగారు. లార్డ్స్ మైదానంలో మహిళల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే తొలి సెంచరీ బాదిన ప్లేయర్‌గా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు. లార్డ్స్ మైదానంలో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన మరో ఏకైక భారతీయ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ (పురుషుల లేదా మహిళల క్రికెట్‌లో) సౌరవ్ గంగూలీ మాత్రమే. ఆయన 1996లో తన అరంగేట్రం (డెబ్యూ) మ్యాచ్‌లోనే 131 పరుగులు చేసి ఈ ఘనత సాధించారు. ఈ అమోఘమైన ఇన్నింగ్స్ ద్వారా లార్డ్స్ మైదానంలోని ప్రతిష్టాత్మక ఆనర్స్ బోర్డ్ పై యస్తికా భాటియా తన పేరును లిఖించుకున్నారు. ఆమె అద్భుత సెంచరీతో భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో 264/5 పరుగుల భారీ స్కోరు చేసి మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

### మరోసారి సెంచరీ చేజార్చుకున్న స్మృతి మంధాన

భారత జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ల నుంచి ఆశించిన ఆరంభాన్ని అందుకుంది. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ మొదటి వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. షెఫాలీ వర్మ 33 పరుగులు చేసి సోఫీ ఎక్లెస్టోన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన యస్తికా భాటియాతో కలిసి స్మృతి మంధాన ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. మొదటి ఇన్నింగ్స్‌లో లాగే మంధాన రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ చేసే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నారు. ఆమె 70 పరుగులు చేసి పవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జెమిమా రోడ్రిగ్స్ (3), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (16), దీప్తి శర్మ (10) తక్కువ పరుగులకే అవుట్ అయినా, యస్తికా మాత్రం నిలకడగా ఆడి జట్టుకు కొండంత ఆధిక్యాన్ని అందించారు. ప్రస్తుతం భారత జట్టు ఇంగ్లండ్‌పై 379 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది.

### మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ ఆధిపత్యం

జులై 10వ తేదీ శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ఓపెనర్ స్మృతి మంధాన 83 పరుగులు, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 58 పరుగులతో హాఫ్ సెంచరీలతో రాణించారు. వీరితో పాటు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా 57 పరుగులతో కీలకమైన హాఫ్ సెంచరీ సాధించారు. జెమిమా రోడ్రిగ్స్ 35 పరుగులు చేయగా, షెఫాలీ వర్మ మాత్రం డకౌట్‌గా వెనుతిరిగారు. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ 3 వికెట్లు పడగొట్టగా, లారెన్ ఫిలర్, ఇస్సీ వాంగ్, మాడీ విలియర్స్ చెరో రెండు వికెట్లు తీశారు.

### ఐదు వికెట్లతో ఇంగ్లండ్‌ను కుప్పకూల్చిన క్రాంతి గౌడ్

భారత్ చేసిన 285 పరుగులకు సమాధానంగా మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి కేవలం 170 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ జట్టులో వికెట్ కీపర్ అమీ జోన్స్ (52), కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (44) మాత్రమే కొంతవరకు పోరాడారు. భారత యువ బౌలర్ క్రాంతి గౌడ్ లార్డ్స్ పిచ్‌పై అద్భుతమైన స్పెల్‌తో ఇంగ్లండ్ బ్యాటర్ల నడుం విరిచారు. ఆమె 17 ఓవర్లలో కేవలం 37 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టారు. లార్డ్స్ మైదానంలో 5 వికెట్ల హాల్ చేసిన ప్రపంచంలోనే తొలి మహిళా క్రికెటర్‌గా క్రాంతి గౌడ్ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. మిగిలిన బౌలర్లలో సయాలీ సత్ఘరే, స్నేహ రాణా చెరో రెండు వికెట్లు తీయడంతో భారత్‌కు మొదటి ఇన్నింగ్స్‌లో 115 పరుగుల కీలక ఆధిక్యం లభించింది.

# ఓడినా తగ్గని మనోధైర్యం..

## ఇంగ్లండ్ గడ్డపై చివరి వరకు పోరాడిన నలుగురు భారత వీరులు వీరే..




ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 0–4తో కోల్పోయినా శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్ తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జట్టు ఓడినా చివరి వరకు పోరాడిన ఈ నలుగురు భారత ఆటగాళ్లు అభిమానుల ప్రశంసలు అందుకున్నారు. భారత టీ20 క్రికెట్ జట్టుకు ప్రస్తుతం గడ్డు కాలం నడుస్తోంది. ఐర్లాండ్ పర్యటనలో చవిచూసిన పరాజయాల తర్వాత, ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ భారత్ 0–4తో ఘోరంగా ఓడిపోయింది. శనివారం జరిగిన ఆఖరి ముగింపు మ్యాచ్‌లో సైతం టీమిండియా 56 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. ఈ సిరీస్ పొడవునా భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఘోరంగా విఫలమైంది. ముఖ్యంగా ఆఖరి మ్యాచ్‌లో కీలకమైన క్యాచ్‌లు వదిలేయడం ఇంగ్లండ్ బ్యాటర్లకు వరంగా మారింది. అయితే జట్టు ఇంతలా ఓడిపోతున్నా, కొంతమంది భారత ఆటగాళ్లు మాత్రం మైదానంలో పట్టుదలతో నిలబడి ఇంగ్లండ్ జట్టుకు గట్టి పోటీ ఇచ్చారు.

### బ్యాటింగ్‌లో అదరగొట్టిన శ్రేయస్ అయ్యర్

కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యూహాలు ఫలించకపోవచ్చు, ఆయన కెప్టెన్సీలో జట్టు వరుసగా 6 మ్యాచ్‌ల్లో ఓడిపోయి ఉండవచ్చు. కానీ ఒక బ్యాటర్‌గా ఆయన తన బాధ్యతను నూటికి నూరు శాతం నెరవేర్చారు. ఈ సిరీస్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా, అలాగే ఓవరాల్ సిరీస్‌లోనే రెండో బెస్ట్ బ్యాటర్‌గా నిలిచారు. రెండో ఎండ్ నుంచి తగిన సహకారం అందకపోయినా అయ్యర్ ఒంటరి పోరాటం చేస్తూ రెండు అద్భుతమైన హాఫ్ సెంచరీలు బాదారు. ఈ సిరీస్‌లో ఆడిన 5 మ్యాచ్‌ల్లో 54.50 సగటుతో, 157.97 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 218 పరుగులు చేశారు. ఇందులో మొదటి మ్యాచ్‌లో చేసిన 68 పరుగులు, నాల్గో మ్యాచ్‌లో చేసిన నాటౌట్ 80 పరుగుల ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచాయి.

### అభిషేక్ శర్మ మెరుపులు

భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తనదైన శైలిలో దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించారు. ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఆయన అద్భుత బ్యాటింగ్ ప్రదర్శించారు. తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీతో మెరిసిన అభిషేక్, రెండో మ్యాచ్‌లో 43 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడారు. అయితే చివరి మూడు మ్యాచ్‌లలో ఆయన కేవలం 29 పరుగులకే పరిమితం కావడం గమనార్హం. ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్–5 బ్యాటర్లలో ఒకరిగా నిలిచిన అభిషేక్ శర్మ, 5 మ్యాచ్‌ల్లో మొత్తం 131 పరుగులు సాధించారు. వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ వంటి సహచర ఓపెనర్లు క్రీజులో ఇబ్బంది పడుతున్నా, అభిషేక్ మాత్రం జట్టుకు మంచి పునాది వేసేందుకు ప్రయత్నించారు.

### ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీ వృథా

ప్రపంచ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరైన వికెట్ కీపర్ బ్యాట్స్ మెన్ ఇషాన్ కిషన్ ఈ సిరీస్‌లో మిశ్రమ ప్రదర్శన ఇచ్చారు. మొదటి మ్యాచ్‌లో డకౌట్ అయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో 49 పరుగులతో ఫామ్‌లోకి వచ్చారు. ఆ తర్వాత మూడు, నాల్గో మ్యాచుల్లో వరుసగా 13, 4 పరుగులకే అవుట్ అయి నిరాశపరిచారు. అయితే, లండన్ వేదికగా జరిగిన ఐదో ఆఖరి మ్యాచ్‌లో కిషన్ పాత ఫామ్?ను అందుకున్నారు. ఆయన మైదానంలో ఉన్నంతసేపు భారత్ గెలుస్తుందనే నమ్మకం కలిగింది. కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 56 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఈ సిరీస్‌లో కిషన్ మొత్తం 122 పరుగులు చేశారు.

### సపోర్ట్ లేకపోయినా వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్

బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ విభాగంలోనూ భారత్‌కు తీవ్ర నిరాశే ఎదురైంది. అయితే లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మాత్రం పవర్‌ప్లేలోనే భారత్‌కు వికెట్లు అందిస్తూ ఇంగ్లండ్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఐదు మ్యాచ్‌ల్లో ఆయన 4 వికెట్లు పడగొట్టారు. రెండో వైపు నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో అర్ష్‌దీప్ అనుకున్న స్థాయిలో ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లు సామ్ కర్రన్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ చెరో 7 వికెట్లతో చెలరేగగా, భారత బౌలర్లలో హర్షిత్ రాణా కేవలం 3 వికెట్లు మాత్రమే తీయగలిగారు. జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం, హార్దిక్ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడంతో భారత జట్టుకు ఇంగ్లండ్ టూర్‌లో అనుభవజ్ఞులైన బౌలర్ల లోటు స్పష్టంగా కనిపించింది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com